సాక్షి అనకాపల్లి

మంగళవారం । 5 । సెప్టెంబర్ । 2023



ప్రతి ఫిర్యాదుకు జవాబు

కలెక్టరేట్ స్పందనకు 270 అర్జీలు వచ్చాయి. ప్రతి వినతికి స్పష్టమైన జవాబు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. IIలో



శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

విశాఖ: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఈ నెల 6వ తేదీ నుంచి 8 వరకు శ్రీ కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తారు.



విద్యార్థులే పాలకులైన వేళ..

విశాఖ: న్యూఢిల్లీలో జీ–20 సదస్సు జరగనున్న నేపథ్యంలో అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్లో మాక్ సదస్సు నిర్వహించారు.

గురుపూజోత్సవ వేళ..

ఏయూ క్యాంపస్/సాక్షి, అనకాపల్లి: ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి రోజున గురుపూజోత్సవం జరుపుకోవడం ఆనవాయితీ. ఆయన నడయాడిన.. ఉప కులపతిగా సేవలందించిన ఆంధ్ర విశ్వకళాపరిషత్‌లో రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించడం ఈ ఏడాది ప్రత్యేకత. చారిత్రక ప్రాధాన్యత కలిగిన కట్టమంచి రామలింగారెడ్డి స్నాతకోత్సవ మందిరం వేదికగా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభం కానుంది. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి పురస్కారాలను ప్రదానం చేసి సత్కరిస్తారు. అనకాపల్లి జిల్లాలో మొత్తం ఐదుగురు ఉపాధ్యాయులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. దేవరాపల్లి మండలం కాశీపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోషల్ టీచర్‌గా పనిచేస్తున్న కొట్యాన రాంబాబు, చీడికాడ మండలం మంచాల మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ చరకాపు వెంకటలక్ష్మి, అచ్యుతాపురం మండలం నునపర్తి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న కేజీయారాణి ఈ అవార్డులు అందుకోనున్న విషయం తెలిసిందే. వీరు కాకుండా బుచ్చెయ్యపేట మండలం వడ్డాది కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ ప్రిన్సిపాల్ కె.అన్నపూర్ణ, ఇంగ్లిష్ బోధనలో కశింకోట మండలం వెదురుపర్తి జెడ్పీ హైస్కూల్ టీచర్ కంటిమహంతి సబిత లక్ష్మి రాష్ట్ర స్థాయి పురస్కారాలకు ఎంపికయ్యారు.



రాష్ట్ర ఉపాధ్యాయ దినోత్సవానికి వేదికైన ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రాంగణం

సర్వేపల్లి నడయాడిన నేల



ఏయూక్యాంపస్: గురువులకే గురువు.. ఉపాధ్యాయ వృత్తికే గౌరవం తెచ్చిన వ్యక్తి సర్వేపల్లి రాధాకృష్ణన్. ఆయన జయంతి సందర్భంగా ఏటా సెప్టెంబర్ 5వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నాం. అటువంటి మహనీయుడు నడయాడిన నేల ఆంధ్ర విశ్వవిద్యాలయం. వ్యవస్థాపక ఉపలకులపతిగా పనిచేసిన కట్టమంచి రామలింగారెడ్డి తన తరువాత ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని నడిపించే సమర్థత కలిగిన వ్యక్తి కోసం అన్వేషించారు. ఈ ప్రయాణంలో ఆయన దృష్టి సర్వేపల్లి రాధాకృష్ణన్‌పై పడింది. సర్వేపల్లిని ఒప్పించి వర్సిటీకి ద్వితీయ ఉపకులపతిగా విశాఖకు తీసుకువచ్చారు. ఏయూ ఉపకులపతిగా 1931 నుంచి 1936 వరకు సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలు అందించారు. ఆయన విశ్వవిద్యాలయంలో ఒక క్రమబద్ధమైన విధానాలు అమలు జరిపారు. దేశ విదేశాల నుంచి ఆచార్యులను ఆహ్వానించడం, విద్యార్థులకు స్ఫూర్తిదాయక ప్రసంగాలు ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలు జరిపారు. ఆయన హయాంలోనే 1932లో ఏయూలో తత్వశాస్త్ర విభాగం ప్రారంభించారు. ఆయనే స్వయంగా ఏయూ తత్వశాస్త్ర విభాగంలో పాఠాలను సైతం బోధించారు. పరిపాలన బాధ్యతలు ఉన్నప్పటికీ ఆయన బోధనకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చేవారు. ఏయూ నుంచి వెళ్లిన తరువాత ఆయన ఉపరాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా అత్యున్నత పదవు లను అలంకరించారు. ఆయన స్ఫూర్తిని నేటి తరానికి అందిస్తూ, ఆయన జ్ఞాపకాలను భవిష్యత్ తరాలకు చేరువ చేసే విధంగా ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల వద్ద సర్వేపల్లి రాధాకృష్ణన్ నిలువెత్తు విగ్రహాన్ని ఏయూ అధికారులు ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం 8.30 గంటలకు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి గురుపూజోత్సవంలో పాల్గొంటారు.

భయాన్ని పోగొట్టి.. ఆంగ్లాన్ని పుక్కిట పట్టి..

వెదురుపర్తి ఇంగ్లిష్ ఉపాధ్యాయిని సబిత లక్ష్మికి రాష్ట్ర స్థాయి అవార్డు



కశింకోట: ఆంగ్ల భాషను పిల్లలకు బోధించడంలో రాష్ట్రంలోనే ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారు.. ప్రధానంగా గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో ఆంగ్లంపై భయాన్ని పోగొట్టి ప్రపంచ భాషను వారికి చేరువ చేశారు.. అందుకే రాష్ట్ర స్థాయి పురస్కారం అందుకుంటున్నారు. వెదురుపర్తి జెడ్పీ హైస్కూల్లో ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కంటిమహంతి సబిత లక్ష్మి ఈ ఘనతను సొంతం చేసుకున్నారు. పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమానికి ప్రభుత్వం పెద్ద పీట వేసిన నేపథ్యంలో ఉపాధ్యాయులను ప్రోత్సహించడానికి ఇంగ్లిష్ మీడియం రాష్ట్ర ప్రత్యేక పురస్కారానికి పది మంది ఎంపిక కాగా, వీరిలో ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి సబిత లక్ష్మి ఒక్కరికే పురస్కారం లభించడం విశేషం. విద్యార్థులకు ఆసక్తి కలిగించేలా బోధించడం ఆమె ప్రత్యేకత. అందుకే వారు భయాన్ని వీడి గురువుకు మంచి పేరు వచ్చేలా చక్కగా చదువుకుంటున్నారు. సమయం సరిపోకపోతే అదనపు తరగతులు, సెలవు రోజుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించయినా ఇంగ్లిష్ నేర్పిస్తుంటారామె. ఇంగ్లిష్ ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చే స్టేట్ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు సబిత లక్ష్మి. ఆమె 6, 7 తరగతులకు ఇంగ్లిష్ పాఠ్య పుస్తకాలు రాశారు కూడా.

జీవితాంతం పాఠాలు చెబుతా

తనకింకా నాలుగేళ్ల సర్వీసు ఉందని, ఉద్యోగ విరమణ చేసినా జీవితాంతం పాఠాలు చెబుతూనే ఉంటానని సబిత లక్ష్మి చెప్పారు. 'సాక్షి'తో మాట్లాడుతూ.. పురస్కారం కోసం దరఖాస్తు చేసుకోకపోయినా ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన టెస్టులో ప్రతిభ ప్రాతిపదికన రాష్ట్ర స్థాయి పురస్కారం రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తన తండ్రి గాంధీ పట్నాయక్ అభీష్టం మేరకు ఎంఏ, బీఈడీ చేసి ఈ వృత్తి చేపట్టానన్నారు.

విద్యార్థుల్ని ప్రోత్సహించి.. ఉత్తమ పురస్కారం పొంది



వడ్డాది కేజీబీవీ ప్రిన్సిపాల్ కె.అన్నపూర్ణ

బుచ్చెయ్యపేట: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా బుచ్చెయ్యపేట మండలం వడ్డాది కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె.అన్నపూర్ణ ఎంపికయ్యారు. గత ఐదేళ్లుగా తను పనిచేస్తున్న పాఠశాలల్లో విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు పలు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థుల్ని ప్రోత్సహించడంతో ప్రభుత్వం ఆమెను రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేశారు. సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జరిగే రాష్ట్ర స్థాయి వేడుకల్లో ప్రముఖుల చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. గతంలో ఆమె ఆలిండియా రేడియోలో కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కరోనా సమయంలో విద్యార్థుల కోసం సర్వేజన ఫౌండేషన్ నిర్వహించిన ప్రత్యేక ఆన్‌లైన్ తరగతుల్లో పాల్గొని సులభ పద్ధతిలో పలు పాఠ్యాంశాలను బోధించారు. బెంగళూర్‌లో బాలల హక్కులపై జరిగిన సెమీనార్‌లో, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సీబీఎస్ఈ విద్యా విధానంపై నిర్వహించిన తరగతుల్లో ఈమె ట్రైనర్‌గా వ్యవహరించారు. విద్యార్థులు పలు పోటీల్లో పాల్గొని, బహుమతులు గెలుచుకోవడంలో తోడ్పడినందుకు గత ఏడాది కస్తూర్బా పాఠశాలల పరిధిలో రాష్ట్ర స్థాయి సావిత్రిబాయి పూలే అవార్డు అందుకున్నారు. వీటన్నింటిని గుర్తించిన ప్రభుత్వం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేసింది.

జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు వీరే.. IIలో

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



మ్యూజికల్ చైర్ పోటీల్లో తలపడుతున్న ఉపాధ్యాయులు

నర్సీపట్నం: సాధారణంగా విద్యార్థులతో ఉపాధ్యాయులు ఆటలాడిస్తారు. కానీ శిష్యులే గురువులకు పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పీఆర్టీయూ ఆధ్వర్యంలో నర్సీపట్నంలో నిర్వహించిన క్రీడా పోటీలు రెండో రోజున ఉల్లాసభరితంగా జరిగాయి. ప్రభుత్వ హైస్కూల్లో నిర్వహించిన మ్యూజికల్ చైర్ పోటీలకు మహిళా ఉపాధ్యాయులు పోటీ పడ్డారు. టెన్నికాయిట్, టగ్ ఆఫ్ వార్ గేమ్స్ నిర్వహించారు. ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉపాధ్యాయుల క్రీడా పోటీలను బాలలు ఆసక్తిగా తిలకించారు. ఈ పోటీల్లో గెలుపొందిన ఉపాధ్యాయులకు మంగళవారం జరిగే ఉపాధ్యాయ దినోత్సవంలో బహుమతులు అందజేస్తామని యూనియన్ జిల్లా అధ్యక్షులు గోపినాథ్ తెలిపారు. ఈ పోటీలను హెచ్ఎం మాధవి పర్యవేక్షించారు.

నేడు అనకాపల్లిలో జిల్లాస్థాయి కార్యక్రమం

అనకాపల్లి టౌన్: స్థానిక గుండాల జంక్షన్ జీవీఎంసీ కల్యాణ మండపంలో మంగళవారం ఉదయం 9 గంటలకు గురుపూజోత్సవం (ఉపాధ్యాయ దినోత్సవం) నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో జరిగే ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్యేలు యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు), ఎ.అదీప్‌రాజు పాల్గొంటారని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో ఎంపికైన 63మంది ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కార ప్రదానం చేస్తామన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'ను విజయవంతం చేద్దాం



జేసీ ఎం.జాహ్నవి

తుమ్మపాల: అక్టోబర్ 2 నుంచి నిర్వహించే 'ఆడుదాం ఆంధ్ర'కార్యక్రమం ద్వారా క్రీడాకారులను ప్రోత్సహించాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి పిలుపునిచ్చారు. కలెక్టరేట్ నుంచి వెబెక్స్ ద్వారా అధికారులతో ఆమె మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అక్టోబర్ 2 నుంచి నవంబర్ 8 వరకు నిర్వహించే వివిధ ఆటల పోటీల్లో ఎక్కువ సంఖ్యలో క్రీడాకారులు పాల్గొనేలా చూడాలన్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు జరిగే ఈ పోటీల్లో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, యోగా, టెన్నీకాయిట్, మారథాన్ బ్యాడ్మింటన్‌తో పాటు ఆయా ప్రాంతాలలో ఉండే సాంప్రదాయ ఆటలను కూడా చేర్చాలన్నారు. ఆటల వల్ల కలిగే ఆనందం, శారీరక ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ క్రీడలలో 15 సంవత్సరాలు పైబడిన వారు పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమానికి అవసరమైన ఆట స్థలాలు, సామగ్రి, రిఫ్రెష్‌మెంట్స్ వంటి వాటికి కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ, మండల స్థాయిలో గెలుపొందిన వారికి ఆటల సామగ్రి, నియోజకవర్గ, జిల్లా స్థాయి విజేతలకు నగదు బహుమతులు అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ విజయభాస్కర్, జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి, గ్రామవార్డు సచివాలయ ప్రత్యేక అధికారి మంజులవాణి, డీఈవో వెంకటలక్ష్మమ్మ, డీఎస్‌వో కెవీఎల్ఎన్ మూర్తి, జీఎండీఐసీ శ్రీధర్, క్రీడాశాఖ చీఫ్ కోచ్ ఎల్‌వీ రమణ, ఎంపీడీవోలు, మండలాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన వేగం.. ప్రమాద బీభత్సం

- ఆగి ఉన్న ఆటో, ద్విచక్రవాహనాలను ఢీకొన్న ఈపీడీసీఎల్ వాహనం
- ముగ్గురికి తీవ్ర గాయాలు



ప్రమాద దృశ్యం

చోడవరం రూరల్: అదుపు తప్పిన వేగంతో వస్తున్న ఏపీఈపీడీసీఎల్ వాహనం గోవాడ గ్రామంలోని భారతీయ స్టేట్ బ్యాంక్ వద్ద బీభత్సం సృష్టించింది. ఈ ప్రమాదంలో ఆగి ఉన్న ఆటోతోపాటు మరో నాలుగు ద్విచక్ర వాహనాలు నుజ్జయ్యాయి. ఆటోలోని ఇద్దరు, బ్యాంకు నుంచి వస్తున్న పాదచారి ఒకరు తీవ్ర గాయాలతో ఆస్పత్రిపాలయ్యారు. చోడవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు కథనం ప్రకారం.. సోమవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో అనకాపల్లి నుంచి చోడవరం వైపు వస్తున్న వాహనాన్ని డ్రైవర్ తుపాకుల ప్రకాశరావు నడుపుతున్నారు. అదుపు తప్పిన వేగంతో వస్తున్న వాహనం గోవాడ భారతీయ స్టేట్ బ్యాంకు వద్దకు వచ్చేసరికి ఎడమ వైపున బ్యాంకు పనుల నిమిత్తం ఆగి ఉన్న ఆటోను ఢీకొట్టింది. అదే వేగంతో ముందుకు దూసుకుపోవడంతో బ్యాంకు ఎదుట నిలిపి ఉన్న నాలుగు ద్విచక్ర వాహనాలపై నుంచి వెళ్లడంతో ఆ వాహనాలు దెబ్బతిన్నాయి. ఆటోలో ఉన్న అంభేరుపురం గ్రామానికి చెందిన డ్రైవర్ ఆడారి గోవిందరావు, ప్రయాణికురాలు దాడి లక్ష్మిలతోపాటు బ్యాంకు పని ముగించుకుని బయటకు వస్తున్న గోవాడ గ్రామానికి చెందిన ఏడువాక అప్పలస్వామిలు తీవ్ర గాయాలపాలయ్యారు. ప్రమాదంలో గాయపడిన వారిని అక్కడి వారు హుటాహుటిన ఆటోల్లో చోడవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయాల తీవ్రత దృష్ట్యా వీరు ముగ్గురిని విశాఖ కింగ్ జార్జి ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్టు సీఐ చెప్పారు. ప్రమాదానికి కారకుడైన వాహనం డ్రైవర్ ప్రకాశరావు అక్కడి నుంచి పరారై, చోడవరం పోలీసు స్టేషన్‌లో లొంగిపోయాడు. విశాఖలోని క్షతగాత్రుల నుంచి వాంగ్మూలాలను సేకరించి ఆటో డ్రైవర్ గోవిందరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

గుణమ్మ విజయం

ఆమె ఓ మత్స్యకార మహిళ.. తల్లిదండ్రులు చేపలు పట్టి కుటుంబాన్ని పోషించారు.. పిల్లల్ని చదివించారు.. సాధారణ స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగిన ఆ చదువుల సరస్వతి చదువుకున్న కళాశాలలోనే ఇప్పుడు పాఠాలు చెబుతోంది.. ఏకంగా డాక్టరేట్ సాధించి అత్యున్నత స్థాయికి ఎదిగింది.

- మత్స్యకార మహిళకు పీహెచ్‌డీ పట్టా
- చదువుకున్న కాలేజీలోనే లెక్చరర్‌గా పాఠాలు



పీహెచ్‌డీ గైడ్ పి.వి.కృష్ణతో గుణ దంపతులు



పీహెచ్‌డీ పట్టాతో మైలపల్లి గుణ

పాయకరావుపేట: కనగర్త.. తక్కువ ధరకే లభించే చేప.. కానీ పోషకాలు పుష్కలం.. తల్లిదండ్రులు మత్స్యకారులు కావడంతో ఆ చేప విశిష్టతపై ఆమెకు అవగాహన ఉంది. మరింత లోతుగా శాస్త్రీయంగా పరిశోధించి, పీహెచ్‌డీ చేసింది. కనగర్త ప్రత్యేకత అందరికీ తెలిసేలా చేసింది. ఆమె పేరు మైలపల్లి గుర్రమ్మ (గుణ). నక్కపల్లి మండలంలోని మత్స్యకార గ్రామం రాజయ్యపేటకు చెందిన మైలపల్లి సత్తిరాజు, బంగారమ్మల కుమార్తె. గుణ ఇంటర్మీడియట్ పాయకరావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివారు. శ్రీప్రకాష్ విద్యా సంస్థలో బీఎస్సీ (జువాలజీ), బీఈడీ విద్యను అభ్యసించారు. అనంతరం ఆంధ్ర యూనివర్సిటీలో ఎమ్మెస్సీ చదివారు. ప్రాన్ అండ్ క్రాప్ కల్చర్‌లో పీజీ డిప్లొమా చేశారు. అనంతరం కనగర్త చేపపై పరిశోధన చేశారు. కనగర్త చేప ఆహార అలవాట్లు, గుడ్లు పెట్టే దశలు, చేప పెరుగుదల, చేప ప్రత్యుత్పత్తిపై అధ్యయనం చేసి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. గైడ్ పి.వి.కృష్ణ నేతృత్వంలో పరిశోధన చేశారు. ఒకప్పుడు తాను ఇంటర్ చదివిన పాయకరావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల్లోనే గుణ ప్రస్తుతం కాంట్రాక్ట్ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు.

భర్త, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం

వృత్తిరీత్యా నా తల్లిదండ్రులు మత్స్యకారులే అయినా చదువుపై నా శ్రద్ధను గమనించి బాగా చదివించారు. నాకు నలుగురు అక్కలు. ఒక సోదరుడు. పెద్దక్క గోసల కాసులమ్మ నక్కపల్లి జెడ్పీటీసీగా సేవలందిస్తున్నారు. భర్త, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతోనే నేను ఈ స్థాయికి వచ్చాను. కనగర్త చేప తక్కువ ధరకు మార్కెట్‌లో లభిస్తుంది. అత్యధిక పోషక విలువలు కలిగి వుంటుంది. అందుకే దానిపై పరిశోధన చేశాను.

–మైలపల్లి గుర్రమ్మ (గుణ)

ఏపీవీవీపీ ఆస్పత్రుల్లో పలు పోస్టుల భర్తీ

దరఖాస్తుకు ఈ నెల 9 ఆఖరు

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్(ఏపీవీవీపీ) ఆస్పత్రుల్లో పలు ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఆడియో మెట్రిషియన్, డెంటల్ టెక్నీషియన్, రేడియోగ్రాఫర్ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో, థియేటర్ అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్, ఆఫీసు సబార్డినేట్ పోస్టులను అవుట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేస్తామని కలెక్టర్ ఎ.మల్లికార్జున ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు అన్ని ధ్రువీకరణపత్రాల జిరాక్స్ కాపీలతో దరఖాస్తు చేయాలని సూచించారు. దరఖాస్తులను ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు ఆస్పత్రుల సేవల సమన్వయ అధికారి వారి కార్యాలయం, గవర్నమెంట్ ఆస్పత్రి, పెందుర్తి కార్యాలయంలో అందజేయాలని జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయాధికారి టి.రమేష్ కిశోర్ తెలిపారు. విద్యార్హతలు, ఖాళీల వివరాలు, వయో పరిమితి, ఇతర వివరాలను https://visakhapatnam.ap.gov.inలో పొందుపరిచినట్లు చెప్పారు.

నిరుద్యోగులకు టోకరా

- విదేశాల్లో ఉద్యోగాల పేరుతో అమృత్ ఎంటర్‌ప్రైజెస్ మోసం
- 70 మంది నుంచి రూ.కోటి వరకు వసూలు



గోడు వెళ్లబోసుకుంటున్న నిరుద్యోగులు

సీతమ్మధార: స్వీడన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ అమృత్ ఎంటర్‌ప్రైజెస్ నిరుద్యోగులకు టోకరా వేసింది. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా కడప తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 70 మంది నుంచి రూ.కోటి వరకు వసూలు చేసి బోర్డు తిప్పేసింది. దీంతో బాధితులు సోమవారం నాలుగో పట్టణ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. దొండపర్తిలోని టీఎస్ఎన్ కాలనీలో అమృత్ ఎంటర్‌ప్రైజెస్ అనే సంస్థను ఏర్పాటు చేసి విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. అది నమ్మి కార్యాలయానికి ఫోన్ చేసిన వారికి అర్హత గల ఉద్యోగాలు ఇప్పిస్తామని.. అందుకు డబ్బు లు చెల్లించాలని మేనేజర్లు కాంతి, లలిత నమ్మించారు. అలాగే నీరజ్, సౌరభ్ తెరవెనుక ఉండి శ్రీకాకుళం, విజయనగర, విశాఖపట్నం, అనకాపల్లి, విజయవాడ, కడప, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 70 మంది నుంచి రూ.లక్ష, రూ.2 లక్షలు చొప్పున రూ.కోటి వరకు ఆన్‌లైన్‌లో వసూలు చేశారు. డబ్బులు చెల్లించినట్లు మేనేజర్లు నిరుద్యోగులకు రసీదులతో పాటు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందజేశారు. అయితే రోజులు గడుస్తున్నప్పటికీ ఉద్యోగాలు రాకపోవడంతో కొంతమంది దొండపర్తిలోని అమృత్ ఎంటర్‌ప్రైజెస్‌కు వెళ్లా రు. కార్యాలయం మూసివేసి ఉండడంతో.. సంస్థ బోర్డు తిప్పేసినట్లు గ్రహించి ఆందోళనకు గురయ్యారు. దీనిపై బాధితులు నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

న్యూస్‌రీల్

అర్ధరాత్రి 108లో ప్రసవం



ప్రసవం అనంతరం బాలింత, బిడ్డతో సిబ్బంది

అచ్యుతాపురం(అనకాపల్లి): 108 సిబ్బంది తమ నిబద్ధతను చాటుకున్నారు. అర్ధరాత్రి పురిటి నొప్పులతో బాధపడుతున్న బాలింతకు సత్వర వైద్య సేవలందించారు. సుఖ ప్రసవానికి సాయపడ్డారు. అచ్యుతాపురం మండలంలోని ఆవసోమవరంకు చెందిన కె.కుమారి(23) పురిటి నొప్పులతో బాధపడుతున్నట్లు 108కి ఆదివారం రాత్రి 01–11 నిమిషాలకు కాల్ వచ్చింది. దీంతో 108 సిబ్బంది ఆవసోమవరం వెళ్లి గర్భిణిని వాహనంలోకి చేర్చి ఆస్పత్రికి బయలుదేరారు. మడుతూరు జంక్షన్‌కు చేరుకునే సరికే ఆమెకు డెలివరీ అయింది. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ ఎడ్ల అప్పలనాయుడు పర్యవేక్షణలో తెల్లవారుజాము 2:04 గంటలకు ప్రసవించిన కుమారి, తనకు పుట్టిన ఆడబిడ్డ క్షేమంగా ఉండటంతో హరిపాలెం పీహెచ్‌సీకి చేర్చారు. డ్రైవర్ ఎస్.శంకర్‌రాజు, 108 సిబ్బంది పనితీరు పట్ల స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

పూడిమడకలో హార్బర్ స్థల పరిశీలన



హార్బర్ నిర్మాణ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న కాంట్రాక్టర్లు, ఇంజినీర్లు

అచ్యుతాపురం(అనకాపల్లి): అనకాపల్లి జిల్లా పూడిమడకలో ఫిషింగ్ హార్బర్ నిర్మించనున్న స్థలాన్ని సదరు కాంట్రాక్టర్ బృందం సోమవారం పరిశీలించింది. విశ్వ సముద్ర హోల్డింగ్స్(హైద్రాబాద్)కి చెందిన సభ్యులు మ్యాప్‌ను, సముద్ర తీరాన్ని సందర్శించారు. మత్స్య శాఖ అధికారులు, మారిటైం బోర్డు సభ్యులు విజయ్ భాస్కర్, చేతక్, హరికృష్ణ, గోపీనాథ్, వెంకట్రావ్, అచ్యుతాపురం మండల మత్స్య శాఖ అధికారి రవిరాజ్, పూడిమడక మాజీ సర్పంచ్ చేపల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయానికి రూ.లక్ష విరాళం



అన్నదాన పథకానికి విరాళం అందజేస్తున్న సత్యవతి

దాబాగార్డెన్స్ (విశాఖ): విశాఖ నగరంలోని బురుజుపేటలో కొలువుదీరిన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి నర్సీపట్నానికి చెందిన సుంకర సత్యవతి రూ.లక్షా 116 విరాళం అందజేశారు. ఆలయంలో శాశ్వత అన్నదాన పథకం నిమిత్తం ఈ మొత్తాన్ని నగదు రూపంలో దేవాలయ సిబ్బందికి సోమవారం అందజేశారు. అమ్మవారి దర్శనం, వేద ఆశీర్వచనం అనంతరం దాతకు ఆలయ అధికారులు ప్రసాదం అందజేశారు.

పిడుగు పడి యువకుడి మృతి

గొలుగొండ: పాతమల్లంపేట రోడ్డు వద్ద పిడుగు పడి ఒక యువకుడు మృతి చెందగా మరో వ్యక్తి గాయాలపాలయ్యాడు. సోమవారం సాయంత్రం భారీ వర్షం కురుస్తున్న సమయంలో జోగుంపేటకు చెందిన ఎస్.జైతు (24), గాదె శ్రీనాథ్ (34) ఉగ్గంపేట వద్ద చింతచెట్టు కిందకు చేరారు. చెట్టుపై పిడుగులు పడటంతో జైతు అక్కడే మృతి చెందాడు. శ్రీనాథ్‌కు గాయాలు కావడంతో 108 వాహనంలో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. తమ ఆయిల్‌పామ్ తోటలు చూసేందుకు ఇద్దరూ పొలానికి వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగింది. జైతును పోస్టుమార్టం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గొలుగొండ ఎస్ఐ నారాయణరావు తెలిపారు.

క్లుప్తంగా

బాల్యవివాహాన్ని అడ్డుకున్న అధికారులు

నక్కపల్లి: మండలంలో డి.అగ్రహారంలో బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. ఇక్కడ వయసు తక్కువ ఉన్న అబ్బాయికి తల్లిదండ్రులు వివాహం నిశ్చయించారన్న విషయం తెలుసుకున్న ఎంఈవో కుంచం నరేష్, ఐసీడీఎస్ సిబ్బంది, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శులు వారి ఇంటికి వెళ్లి బాల్యవివాహం చేస్తే వచ్చే నష్టాలను, ఇబ్బందులు గురించి వివరించారు చట్టాలను గురించి అవగాహన కల్పించారు. బాల్య వివాహం చేయడం నేరమన్నారు. దీంతో అధికారుల సూచనలు పాటిస్తామని ఆ కుటుంబ సభ్యులు తెలిపారు.

ఎస్పీ కార్యాలయంలో స్పందనకు 35 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లిటౌన్: ఎస్పీ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమానికి 35 అర్జీలు వచ్చినట్టు ఎస్పీ కె.వి.మురళీకృష్ణ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టపరిధిలో ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కరించవలసిందిగా సంబంధిత అధికారులకు ఆయన ఆదేశాలు జారీచేశారు. ఆస్తి తగాదాలు, కుటుంబ సమస్యలపై అర్జీలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రైం ఎస్పీ పి.సత్యనారాయణరావు, డీపీటీసీ డీఎస్పీ పి.శ్రీనివాసరావు, ఎస్ఐ డి.లక్ష్మీనారాయణ, అర్జీదారులు పాల్గొన్నారు.

ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులో ప్రవేశాలకు 30 వరకు గడువు

మహారాణిపేట: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ట్రైనింగ్ సెంటర్లలో మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (ఫీమేల్)/ఏఎన్ఎం కోర్సులో ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించడానికి, దరఖాస్తులు సమర్పించడానికి ఈ నెల 30వ తేదీ వరకు అవకాశం ఉందని డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు. పూర్తి వివరాలకు https://cfw.ap.nic.inను సందర్శించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ మద్దతుదారులదే హవా

ఉప సర్పంచ్‌ల ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులదే హవా నడిచింది. ఎస్.రాయవరం వైస్ ఎంపీపీతోపాటు కోటవురట్ల మండలం కె.వెంకటాపురం, చోడవరం మండలం గోవాడ, చీడికాడ మండలం దిబ్బపాలెం ఉప సర్పంచ్ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లు ఉప సర్పంచ్ ఎన్నికలో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి ప్రలోభాలకు గురిచేసినా ఫలించకపోవడంతో అధికార పార్టీ బలపరిచిన అభ్యర్థి ఏకగ్రీవమయ్యారు.

- ఎస్.రాయవరం వైస్ ఎంపీపీగా బొలిశెట్టి గోవిందరావు
- 3 ఉప సర్పంచ్‌ల ఎన్నిక ఏకగ్రీవం
- మరో చోట ప్రతిపక్షాలకు భంగపాటు



వైస్ ఎంపీపీ గా ఎన్నికయిన గోవిందరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు



ఉప సర్పంచ్‌గా ఎన్నికైన నాయుడు నానాజీని అభినందిస్తున్న నాయకులు

ఎస్.రాయవరం: మండల పరిషత్ వైస్ ఎంపీపీగా బొలిశెట్టి గోవిందరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలో వైస్ ఎంపీపీ కోన లోవలక్ష్మి ఎంపీపీగా ఎన్నిక కావడంతో ఆమె రెండో వైస్ ఎంపీపీ పదవికి రాజీనామా చేశారు. ఈ స్థానానికి వైఎస్సార్ సీపీ జిల్లా కోశాధికారి, ఎంపీటీసీ సభ్యుడు బొలిశెట్టి గోవిందరావును ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని మెజార్టీ ఎంపీటీసీ సభ్యులు మద్దతు పలికారు. ఈ మేరకు గోవిందరావు ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఎంపీడీవో రామచంద్రమూర్తి ప్రకటించారు. ఈ సందర్భంగా గోవిందరావును పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కోన లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకర దేవి, మరో వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, ఎంపీటీసీలు బాలం సూరిబాబు, బొండా వెంకటలక్ష్మి, శానాపతి శ్రీరాము తదితరులు పాల్గొన్నారు.

అంతా ఏకగ్రీవమే...

కోటవురట్ల మండలం కె.వెంకటాపురం గ్రామ పంచాయతీలో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి ఉప సర్పంచ్‌గా గొల్లు శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత నెల 28న ఉప సర్పంచ్ రామకృష్ణ అనారోగ్యంతో రాజీనామా చేయడంతో సోమవారం ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. చోడవరం మండలం గోవాడ పంచాయతీ ఉప సర్పంచ్‌గా వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి నక్కా త్రివేణి, చీడికాడ మండలం దిబ్బపాలెం పంచాయతీ నూతన ఉప సర్పంచ్‌గా దారపు రమణమ్మ ఎన్నికయ్యారు. ఆయా పంచాయతీల్లో రెండున్నర సంవత్సరాల ఒప్పందం ప్రకారం ఉప ఎన్నిక నిర్వహించారు.

చినదొడ్డిగల్లులో టీడీపీ, జనసేనలకు భంగపాటు

నక్కపల్లి: నాటకీయ పరిణామాల మధ్య సోమవారం జరిగిన ఉప ఎన్నికల్లో చినదొడ్డిగల్లు పంచాయతీ ఉప సర్పంచ్ పదవిని వైఎస్సార్‌సీపీ బలపరిచిన నాయుడు నానాజీ కైవసం చేసుకున్నారు. మండలంలో రెండో పెద్ద గ్రామమైన చినదొడ్డిగల్లులో గత నెల ఒకటో వార్డుకు జరిగిన ఉప ఎన్నికల్లో భంగపాటు ఎదుర్కొన్న టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు ఉప సర్పంచ్ ఎన్నికల్లోనూ పరాభవం తప్పలేదు. గత నెల వార్డు ఉప ఎన్నికల్లో ఈ మూడు పార్టీలు ఉమ్మడి అభ్యర్థిని బరిలో నిలిపాయి. ఓటుకు రూ.4 వేల చొప్పున పంచి పెట్టడంతోపాటు తమ ఉమ్మడి అభ్యర్థి గెలుస్తాడంటూ రూ.40 లక్షల పైనే బెట్టింగ్ కాసినట్టు సమాచారం. చివరకు వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేసిన నాయుడు నానాజీ ఒక్క ఓటు మెజార్టీతో విజయం సాధించాడు. ఇదే పంచాయతీలో ఒకటో వార్డు సభ్యుడు వెలగా ఈశ్వరరావు ఎంపీటీసీగా గెలిచి వైస్ ఎంపీపీ పదవి చేపట్టడంతో ఉప సర్పంచ్ పదవికి రాజీనామా చేశారు. దీంతో అధికారులు సోమవారం ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించారు. పంచాయతీలో మొత్తం 14 వార్డు సభ్యుల్లో టీడీపీ తరఫున నలుగురు, వైఎస్సార్ సీపీ తరఫున 10 మంది ఉన్నారు. మెజార్టీ లేకపోయినప్పటికీ వైఎస్సార్‌సీపీకి చెందిన ముగ్గురు సభ్యులను ప్రలోభాలకు గురిచేయడానికి టీడీపీ, జనసేన నేతలు విఫల యత్నం చేశారు. చివరికి తమ ఆటలు సాగకపోవడంతో టీడీపీ వార్డు సభ్యులు గైర్హాజరయ్యారు. దీంతో ఉప సర్పంచ్‌గా నాయుడు నానాజీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి పి. వెంకటనారాయణ ప్రకటించారు. ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించి ధ్రువపత్రం అందజేశారు. నానాజీని ఏపీ పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు తోట సత్తిబాబు, వేంపాడు, గొడిచర్ల పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జులు మణిరాజు, పాపారావు, సర్పంచ్ అభినందించారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు వీరే..

సాక్షి, అనకాపల్లి: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు 63 మంది ఎంపికయ్యారు. ఈ నెల 5వ తేదీన అనకాపల్లిలో జరిగే గురుపూజోత్సవంలో వీరు పురస్కారాలను అందుకోనున్నారు. వీరిలో ఇద్దరు ప్రిన్సిపాళ్లు, ఏడుగురు హెడ్‌మాస్టార్లు, 24 మంది స్కూల్ అసిస్టెంట్లు, 22 మంది ఎస్‌జీటీలు, ఇద్దరు లాంగ్వేజ్ పండిట్‌లు, ఇద్దరు పీఈటీలు, ఒక ఒకేషనల్ టీచర్, ఒక సీఆర్‌టీ, ఒక పీజీటీ, ఒక టీజీటీ ఉన్నారు.

ప్రిన్సిపాళ్లు

కె.పి.డి.సంధ్య (ఏపీ మోడల్ స్కూల్, వేములపూడి), టి.మధు (ఏపీఆర్ఎస్, అచ్యుతాపురం)

హెడ్ మాస్టర్లు

గుంజ రామారావు (జెడ్పీహెచ్ఎస్, పాయకరావుపేట), డెక్కల రత్నం (జెడ్పీహెచ్ఎస్, నర్సీపట్నం), కె.శివప్రసాద్ (జెడ్పీహెచ్ఎస్, సమ్మచింత), బర్రె కుమార్ (జెడ్పీహెచ్ఎస్, తోటాడ), కొలకలూరి రుద్రరాణి (జీవీఎంసీ హైస్కూల్, అనకాపల్లి), గుంజ రత్నజీ (జెడ్పీహెచ్ఎస్, చోద్యం), బావరాజు అప్పారావు (జీటీడబ్ల్యూఏ స్కూల్, నరసయ్యపేట)

స్కూల్ అసిస్టెంట్లు

ఇంగ్లిషు సబ్జెక్టులో పి.వి.ఎం.నాగజ్యోతి (రోలుగుంట), బొయిన చిన్నారావు (వెదురుపర్తి), సూరెడ్డి జగన్‌మోహన్ (కె.జె పురం), సాకూరు సత్యనారాయణ (కొరుప్రోలు), కోర్తం ఈశ్వర్‌రావు (కె.కోటపాడు), షేక్ బాషా (హరిపాలెం), కొణతాల ఎ.వి.కె.కుమార్ (డిబ్బిడి), పి.స్వర్ణ గౌరి (రేవుపోలవరం), గార రమేష్ (దార్లపూడి), వి.బలరామ మహేశ్వరి (గుడివాడ), కోరాడ వనజ (నక్కపల్లి), బొనగిరి రామకృష్ణ (నాగులపల్లి), బుద్ధా రామారావు (వడ్రపల్లి), ఎస్.వి.ఎల్.ఎన్.గుప్త (తాటిపర్తి), జి.సుజాత (వి.మాడుగుల), బండారు సుబ్రమణ్యేశ్వరి (పెదగుమ్ములూరు), కొరుప్రోలు వెంకటేశ్వరరావు (తాళ్లపాలెం), ఎం.మురళీమనోహర్ (పెదపాడు), వి.సి.కె.డి.వర్మ (సబ్బవరం), ఎన్.సబిత, తిరుపతి లక్ష్మినాయుడు (వెదురుపర్తి), చొక్క అప్పలరాజు (తిమ్మరాజుపేట), రవినుతుల వి.ఎల్.ఎస్.మూర్తి (నర్సీపట్నం), చీపురుపల్లి భవాని (నక్కపల్లి)

ఎస్‌జీటీలు..

చింతపల్లి నూకయ్యదొర (వెంకటనగరం), ఎ.వి.ఎస్.ప్రసాద్ (వి.శరభవరం), చింతల సూర్యారావు (ఎన్.జి.నగరం), బర్రె వెలంగిరాణి (వి.ఎన్ పేట), కె.వి.ఎస్.సత్యనారాయణ(వడ్రపల్లి), బొజంకి రామచంద్రరావు (వేమగిరి), సిహెచ్.ఎస్.ఎస్.మూర్తి (సిహెచ్.ఎల్.పురం), కె.నానాజీ (గాంధీనగరం), పి.వి.రమణి (చోడవరం), మహమద్ అలీ (కలపాక), షేక్ మెహిద్దీన్ (శృంగవరం), కె.వి.జ్ఞానపర్తి (సుందరయ్యపేట), జి.దేముడు బాబు (జి.భీమవరం), బి.రాజేశ్వరి (దోసూరు), ఎన్.ప్రభాకర్ (ఎస్.కొత్తూరు), పి.శ్రీనివాసరావు (పి.బి.పాలెం), ఆర్.గణపతి (చీడికాడ), జి.వెంకటలక్ష్మి (మాకవరపాలెం), అంబటి ఈశ్వరరావు (కొత్తకోట), ఆల్బాజ్ షరీఫ్ (గోకివాడ), కుర్ర వెంకటలక్ష్మి (జోగింపేట)

ఇంకా..

ఎడల దారకొండ-పీటీజీ (సివిక్స్)
ఆకెల రోహిణి- టీజీటీ (సోషల్)
కె.జనార్దన్‌రావు-ఒకేషనల్ టీచర్

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

కోటవురట్ల: ఒంటరి మహిళ మెడలో నుంచి అగంతకులు మూడున్నర తులాల బంగారు పుస్తెలతాడును లాక్కుని పరారయ్యారు. ఈ మేరకు బాధితురాలు స్థానిక పోలీసు స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేసింది. ఎస్ఐ నారాయణరావు వివరాల ప్రకారం... చౌడువాడ గ్రామానికి చెందిన శానాపతి నాగమణి గ్రామ శివారున కోళ్ల ఫారం వద్ద ఉండగా, బైక్‌పై వచ్చిన ఇద్దరు అగంతకులు తాము కోళ్ల ఫారాల సూపర్‌వైజర్లమని చెప్పి మాటలతో ఏమార్చి పుస్తెలతాడును లాక్కుని బైక్‌పై ఉడాయించారు. బాధితురాలు కేకలు వేస్తూ పరుగులు తీసినా ప్రయోజనం లేకపోయింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

హత్యా? రోడ్డు ప్రమాదమా?

ముద్దుర్తి జంక్షన్ సమీపంలో యువకుడి అనుమానాస్పద మృతి



మృతుని సమీపంలో విరిగిపడి ఉన్న పల్సర్ బైకు



మృతుడు అడ్డూరుకు చెందిన దేముడు

చోడవరం రూరల్: మండలంలోని చోడవరం-అనకాపల్లి రహదారిలో ముద్దుర్తి జంక్షన్ సమీపంలో సోమవారం రాత్రి యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. రోడ్డు ప్రమాదంలా కనిపిస్తున్నప్పటికీ అందుకు తగిన దాఖలాలు లేకపోవడంతో యువకుడి మృతి పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అనుమానాస్పద మృతి పట్ల చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు వివరాల ప్రకారం... మండలంలోని వెంకన్నపాలెం - ముద్దుర్తి జంక్షన్‌ల మధ్య అనకాపల్లి రహదారిలో యువకుడు(24) మృతి చెంది ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే ప్రమాద స్థలికి చేరుకోగా మృతుడు మండలంలోని అడ్డూరు గ్రామానికి చెందిన సానబోయిన దేముడుగా గుర్తించారు. అతనికి సమీపంలో పల్సర్ బైకు(ఏపీ 39ఏఎస్ 8884) పొదల వద్ద పడి ఉంది. బైకు ముందు భాగం ఛిద్రమై ఫ్రంట్ వీలు ఫోర్కు విరిగిపోయింది. మృతికి కారణం తెలియరాలేదని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామని, యువకుని మృతి గల కారణాలను వెలికి తీస్తామని సీఐ తెలిపారు.

గిరిజన గ్రామాలకు అక్షరోదయం



గిరిజన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో వలంటీర్, ఎంఈవోలు జానుప్రసాద్, జగ్గారావు

పీత్రుగెడ్డలో పాఠశాల ప్రారంభంపై హర్షం

రోలుగుంట: ఆ గిరిజన గ్రామాలకు తొలిసారిగా అక్షరోదయం కలిగింది. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు ప్రభుత్వ పాఠశాల లేకపోవడంతో గిరిజనులంతా చదువుకు దూరమయ్యారు. ఈ గ్రామాలకు చెందిన వారు కొండ కింద ఉన్న శరభవరం గ్రామానికి ఎనిమిది కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లి చదువుకోవడం కష్టం కావడంతో కొంతమంది దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకునేవారు. ఈ నేపథ్యంలో ఎస్.ఆర్.ఎస్.టి.సి. కింద పాఠశాల మంజూరైంది. గిరిజన పంచాయతీ అర్ల శివారు పీత్రుగెడ్డలో సోమవారం ఆ పాఠశాలను ఎంఈవో- 1, 2 జానుప్రసాద్, జగ్గారావు, స్థానిక సర్పంచ్ వండల వనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో లోసింగి, చినగెడ్డ, పెదగెడ్డ తదితర ఆరు గ్రామాల్లో 32 మంది బడిఈడు పిల్లలను గుర్తించి, ఇక్కడ పాఠశాల ఏర్పాటుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదించామన్నారు. ఉపాధ్యాయ వలంటీర్ పోస్టుకు అయిదుగురు అభ్యర్థుల నుంచి వచ్చిన దరఖాస్తుల్లో అర్హత కలిగిన భణికెల సురేష్‌ను నియమించామన్నారు. తమ పర్యవేక్షణలో ఇక్కడ చిన్నారుల విద్యాభ్యాసం మెరుగుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు. ఇక్కడ పాఠశాల మంజూరుపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పోతల లక్ష్మీరమణమ్మ తెలిపారు.

ప్రతి ఫిర్యాదుకు స్పష్టమైన జవాబు ఇవ్వాలి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి, జేసి జాహ్నవి

తుమ్మపాల: స్పందన (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమంలో దాఖలయ్యే వినతులు, ఫిర్యాదులకు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ వీసీ హాలులో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్య పరిష్కారంపై అర్జీదారుడు సంతృప్తి చెందారా లేదా అనే అంశాన్ని రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అర్జీదారుకు నేరుగా ఫోన్ ద్వారా తెలుసుకోవడం జరుగుతుందన్నారు. జేసీ ఎం.జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.డి.అనిత అర్జీలు స్వీకరించారు. మొత్తం 270 అర్జీలు నమోదయ్యాయి.

మాకు న్యాయం చేయాలి...

ఎంతో కాలంగా తాము సాగు చేస్తున్న జీడిమామిడి తోటను లాక్కుని తమకు అన్యాయం చేస్తున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ ఎస్.రాయవరం మండలం చినఉప్పలం గ్రామానికి చెందిన చలపాక నాగమణి, కలిదిండి అప్పలనర్స కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

బీసీ విద్యార్థులకు అన్యాయం

రాష్ట్రంలోని కొత్తగా ఏర్పాటైన మెడికల్ కళాశాలల్లో ఎంబీబీఎస్ సీట్లు అమ్ముకోవడం ద్వారా బడుగు బలహీన వర్గాల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని, రిజర్వేషన్ ప్రకారం వారికి కేటాయించిన సీట్ల దామాషా పద్ధతిలో అమలు చేయాలని టీడీపీ బీసీ విభాగం నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కన్వీనర్ కోటాలో 50 శాతం, సెల్ఫ్ ఫైనాన్సింగ్ విధానంలో 35 శాతం, ఎన్ఆర్ఐ కోటాలో 15 శాతం సీట్లు భర్తీ చేసేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు.

అసంపూర్తి పనులపై ఫిర్యాదు

అనకాపల్లి యల్లయ్య కాలువ పూడికతీతకు మంజూరైన రూ.1కోటి దుర్వినియోగం అవుతున్నాయని, అసంపూర్తి పనులతో కాంట్రాక్టర్ నిధులు దోపిడీ చేస్తున్నారని కలెక్టర్ నేరుగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆమ్‌ఆద్మీ పార్టీ కన్వీనర్ కొణతాల హరినాద్‌బాబు స్పందనలో అర్జీ చేశారు.

మద్యం మత్తులో ఇద్దరు మహిళలపై దాడి

యువకుడిపై కేసు నమోదు చేసిన పోలీసులు



ధ్వంసమైన వ్యాన్ అద్దం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దేవి

రావికమతం: మద్యం మత్తులో టాటా ఏస్ వ్యాన్ అద్దాలు బద్దలుగొట్టడమే కాక అడ్డుకున్న ఇద్దరు మహిళలపై దాడి చేసి తీవ్రగాయాల పాల్జేసిన యువకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కొత్తకోట ఎస్ఐ విభీషణరావు సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలివి. కొత్తకోట గ్రామానికి చెందిన కొంకుపూడి సాయి ఈ నెల 2న పూటుగా మద్యం సేవించి బైక్‌పై అతివేగంతో తిరిగాడు. అదే సమయంలో అటుగా వచ్చిన ఒక టాటా ఏస్ వాహనాన్ని అడ్డుకున్నాడు. డ్రైవర్ సోమశేఖర్ హారన్ వేస్తూ సైడివ్వమనడంతో కోపోద్రిక్తుడైన సాయి ఆవేశంతో వ్యాన్ అద్దాలను బద్దలుగొట్టాడు. దీంతో డ్రైవర్ సోమశేఖర్‌తో పాటు ఆ వాహనంలో ఉన్న పలువురు మహిళలు వ్యాన్ దిగి అనవసర గొడవ ఏంటంటూ నిలదీయడంతో మరింత రెచ్చిపోయిన సాయి వారిపై దాడి చేశాడు. డ్రైవర్ సోమశేఖర్‌ను, గెంజి దేవి అనే మహిళను దవడపై కొట్టాడు. దేవికి చెవి వద్ద తీవ్ర గాయమైంది. మరో మహిళ కోట రమణమ్మను బలంగా తోసేయడంతో ఆమెకు కాలి మోకాలు వద్ద విరిగి పోయింది. గాయాలపాలైన వారిద్దరినీ చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించామని, దాడికి పాల్పడ్డ సాయిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ విభీషణరావు తెలిపారు.

పాల ట్యాంకర్ లారీ బోల్తా

స్వల్ప గాయాలతో బయటపడ్డ డ్రైవర్



పొలంలో బోల్తా పడిన పాల ట్యాంకర్

కె.కోటపాడు: మండలంలోని ఎ.భీమవరం సమీపంలో రోడ్డు పక్కన పొలాల్లో విశాఖ డెయిరీ పాల ట్యాంకర్ లారీ సోమవారం బోల్తా పడింది. దేవరాపల్లి, చీడికాడ మండలాల్లో పాల సేకరణ కేంద్రాల నుంచి పాలతో ట్యాంకర్ లారీ బయలుదేరింది. ఈ క్రమంలో ఎ.భీమవరం వద్ద ముందు వెళ్తున్న ఆటోను ఓవర్ టేక్ చేసే క్రమంలో అదుపు తప్పింది. రోడ్డు పక్కనే పొలాల వైపు దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ఘటనలో పాల ట్యాంకర్ లారీ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతుడు రాజ్‌కుమార్

అనకాపల్లిటౌన్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి సోమవారం మృతి చెందాడు. ట్రాఫిక్ ఎస్ఐ జె.రమేష్ అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక ఆమంచివారివీధికి చెందిన ఎం.రాజ్‌కుమార్(58) లంకెలపాలెం ఫార్మా కంపెనీలో పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే తన స్వగృహం నుంచి ద్విచక్రవాహనంపై కంపెనీకి వెళ్తుండగా మార్గమధ్యంలో కొప్పాక బ్రిడ్జి వద్ద బైక్‌పై నుంచి జారిపడడంతో అతని తలకు తీవ్రగాయమైంది. స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ క్షతగాత్రుడు మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మీభాను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

చంద్రబాబు కుంభకోణంపై ఉన్నత స్థాయి దర్యాప్తు

ఏపీఎఫ్‌యూఐడీసీ డైరెక్టర్ వీసం డిమాండ్

నక్కపల్లి: అమరావతి రాజధానికి నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి రూ.118 కోట్ల కుంభకోణానికి పాల్పడిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడిని తక్షణమే అరెస్టు చేసి ఈడీ, సీబీఐ విచారణ చేపట్టాలని ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీఎఫ్‌యూఐడీసీ) డైరెక్టర్, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వీసం రామకృష్ణ డిమాండ్ చేశారు. పీఏ శ్రీనివాస్ ద్వారా ఈ ముడుపులు అందుకున్నట్లు చంద్రబాబుకు ఐటీ శాఖ జారీ చేసిన నోటీసుల్లో పేర్కొందన్నారు. చంద్రబాబు సచ్చీలుడైతే సహేతుకమైన సమాధానం ఇవ్వాలన్నారు. తనను అరెస్టు చేయకుండా బీజేపీతో రాయబేరాలు నడుపుతున్నారని విమర్శించారు. చంద్రబాబు హయాంలో అన్ని కుంభకోణాలు, రాజధాని భూమి కేటాయింపుల పైనా సీబీఐ విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

రైవాడ జలాశయంలో బోటు బోల్తా

గల్లంతైన రైతు మృత్యువాత



మృతుడు వెంకట జోగరావు (ఫైల్)



రైవాడ జలాశయంలో తేలిన చల్లా వెంకట జోగారావు మృతదేహం

దేవరాపల్లి: మండలంలోని రైవాడ జలాశయం అవతలి వైపు పొలానికి వెళ్తున్న బోటు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రైవాడ గ్రామానికి చెందిన చల్లా వెంకట జోగారావు (43) మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. శనివారం మధ్యాహ్నం జలాశయం అవతలి వైపు పొలానికి వెళ్తుండగా ఈదురు గాలుల ధాటికి బోటు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జోగారావు జలాశయంలో గల్లంతయ్యాడు. శనివారం రాత్రికి ఇంటికి రాకపోవడంతో అతడి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు రెండు రోజులుగా గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం తెల్లవారుజామున జలాశయంలో మృతదేహం లభ్యమైంది. కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలిచిన అతడు విగతజీవిగా కనిపించడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. దీంతో రైవాడలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య పైడిరాజు, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.నాగేంద్ర తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఆస్పత్రికి తరలించామన్నారు.

తెలుగును ప్రేమించి.. ప్రోత్సహిద్దాం

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



తెలుగుభేరి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వెంకయ్యనాయుడు

తాటిచెట్లపాలెం: ప్రతి ఒక్కరూ తెలుగును ప్రేమించి.. ప్రోత్సహించి.. భాష ప్రాధాన్యాన్ని భావి తరాలకు తెలియజేయాలని మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో తెలుగుదండు ఆధ్వర్యంలో సోమవారం తెలుగుభేరి పుస్తకాన్ని ఆవిష్కరించి, మాట్లాడారు. తెలుగు భాషలో పద్యాలు, సాహిత్యం, గేయాలు, రచనలకు చాలా ప్రాముఖ్యముందన్నారు. వారసత్వం అంటే ఆస్తి కాదని.. జన్మభూమి, మాతృభాష, కన్నతల్లి నిజమైన వారసత్వ ఆస్తులన్నారు. తెలుగు పద్యాలను చదవడం వలన జ్ఞాపకశక్తి, భాషా పరిజ్ఞానం మరింత పెరుగుతుందన్నారు. మాతృభాష కళ్ల లాంటిదని, పరభాష కళ్లజోడులాంటిదన్నారు. కళ్లజోళ్లను ఎన్నయినా మార్చవచ్చు కానీ కళ్లను మార్చలేమన్నారు. విద్యార్థి స్థాయి నుంచే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాతృభాషను ప్రోత్సహించాలన్నారు. ఎనిమిదో తరగతి వరకు మాతృభాషలో విద్యాభ్యాసం ఉండాలని అభిప్రాయపడ్డారు. తనకు తెలుగు అన్నా, తెలుగు సంస్కృతి అన్నా ఎనలేని ప్రేమ, అభిమానం అని తెలిపారు. మాతృభాషను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రసార సాధనాలపై ఉందన్నారు. తెలుగుభేరి పుస్తక రచయిత పరవస్తు సూరిని అభినందించారు. విజయ్‌నిర్మాణ్ కంపెనీ అధినేత సూరపనేని విజయ్‌కుమార్, కవులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

82వ వార్డులో 'గడప గడపకు' నేడు

అనకాపల్లిటౌన్: స్థానిక 82వ వార్డు పరిధి అంజయ్యకాలనీ, గాంధీనగరంలో బుధవారం ఉదయం 8 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖల అధికారులు, సచివాలయం ఉద్యోగులు, కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, వలంటీర్లు హాజరుకావాల్సిందిగా కోరారు.

నేడు గురువులకు సన్మానం

అనకాపల్లిటౌన్: స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయ రహదారి వైఎంవీఏ గ్రంథి సత్యనారాయణమూర్తి మెమోరియల్ ఏసీ హాల్లో మంగళవారం ఉదయం 10 గంటలకు ఉపాధ్యాయ దినోత్సవం జరగనుంది. జీవీఎంసీ పెద్ద హైస్కూల్ 1989-90 టెన్త్ బ్యాచ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ వేడుకల్లో ఉపాధ్యాయులకు సన్మానం చేయనున్నట్లు అసోసియేషన్ ప్రతినిధి ఈశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్వ విద్యార్థులంతా హాజరుకావాలని కోరారు.

జాబ్ మేళాలు రేపు

అనకాపల్లిటౌన్: స్థానిక దాడి వీరునాయుడు డిగ్రీ కళాశాల ఆవరణలో బుధవారం ఉదయం 10 గంటలకు నిరుద్యోగ యువతీ యువకులకు బజాజ్ కంపెనీలో ఉద్యోగాల కొరకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కొరిబిల్లి రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగులకు మాత్రమే జాబ్ మేళాకు హాజరుకావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులు అనకాపల్లి, పరవాడ, సబ్బవరం, పాడేరు, మాకవరం, నర్సీపట్నం, చోడవరం, యలమంచిలి, అరకు మండలాల్లో పనిచేయాల్సి ఉంటుందన్నారు.

ఫైజర్ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో...

స్థానిక ఆదినారాయణ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 6న ఫైజర్ హెల్త్ కేర్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కొణతాల రఘునాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేళాలో ఎంపికైన విద్యార్థులకు జిల్లాలోని పరవాడలో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 20 ఏళ్లలోపు వయసు కలిగి, ఇంటర్ ఉత్తీర్ణులు, డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు మాత్రమే మేళాకు హాజరుకావాలన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా కోరారు.

బెల్లం ధరలు

అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 336 బెల్లం దిమ్మలు వచ్చాయి..

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,150	4,540
రెండో రకం	3,080	4,130
మూడోరకం	3,860	4,070

అనకాపల్లి సినిమాలు

మిస్టిక్ (ఉదయం, సాయంత్రం)	
బేబి (మ్యాట్నీ, రాత్రి)	:రాజా
ఏం చేస్తున్నావ్	:సత్యనారాయణ స్క్రీన్-1
ద ఈక్వలైజర్ 3	:సత్యనారాయణ స్క్రీన్-2
జైలర్	:షిర్డిసాయి
ఖుషి	:పర్తిసాయి
బెదురులంక 2012	:వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్	:శ్రీసత్య
ఖుషి	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 93 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-14 యూనిట్లు, బీ పాజిటివ్-35 యూనిట్లు, బీ నెగిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-35 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు, ఏబీ నెగిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 482 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 426 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

తొలగిన ప'రేషన్'

రేషన్ కార్డు.. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు భరోసా. ఒకప్పుడు రేషన్ కార్డు కావాలంటే ఆ తిప్పలు చెప్పనలవి కానివి. ఎప్పుడో తప్ప.. రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉండేది కాదు. గత ప్రభుత్వంలోనైతే మరీ దారుణం. జననేత జగన్ పాలనలో ప్రజల ప్రతి అవసరం వారి ఇంటి ముంగిటే నెరవేరుతోంది. ఇపుడు రేషన్ కార్డుల జారీ కూడా వలంటీర్ వ్యవస్థ ద్వారా సచివాలయంలోనే అందించనుంది. ఇక మీదట ఎప్పుడైనా.. దరఖాస్తు చేసుకోవచ్చు.

- సచివాలయాల ద్వారా రేషన్ కార్డులకు దరఖాస్తులు
- నిరంతర కార్డుల మంజూరుకు ప్రభుత్వం చర్యలు
- అనకాపల్లి డివిజన్‌లో కొత్తగా 3,986 రేషన్ కార్డులు



రేషన్ సరకుల్ని ఇళ్ల వద్దే అందిస్తున్న ఎండీయూ వాహనం(ఇన్‌సెట్) రేషన్ కార్డు కోసం దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్న వలంటీర్

అనకాపల్లి రూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మరిన్ని అవసరాలు తీర్చేందుకు చర్యలు తీసుకుంది. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందిస్తోంది. దీనిలో భాగంగా రేషన్(బియ్యం) కార్డుల జారీని మరింత సులభతరం చేసి అర్హులందరికీ మంజూరు చేసేలా ఏర్పాట్లు చేసింది. పేద కుటుంబాలకు జీవనాధారమైన రేషన్ కార్డుల జారీని నిరంతర ప్రక్రియగా మార్చింది. గతంలో ప్రజాప్రతినిధులు, అధికారపార్టీ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తే తప్ప రేషన్ కార్డులు మంజూరయ్యేవికావు. ఈ అవస్థలకు చెక్ పెడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా బియ్యం కార్డుల జారీకి చర్యలు తీసుకుంది.

మండలాల వారీగా మంజూరైన రేషన్ కార్డులు	
మండలం	కొత్త కార్డులు
అనకాపల్లి	758
కశింకోట	288
మునగపాక	256
బుచ్చెయ్యపేట	277
సబ్బవరం	280
కె కోటపాడు	271
చోడవరం	395
దేవరాపల్లి	283
అచ్యుతాపురం	345
రాంబిల్లి	285
పరవాడ	234
యలమంచిలి	314
మొత్తం	3986

వలంటీర్ల ద్వారా గుర్తింపు

వలంటీర్ల ద్వారా అర్హులను గుర్తిస్తూ కార్డులను నేరుగా లబ్ధిదారులకు అందించేలా ప్రభుత్వం కొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చింది. తాజాగా అనకాపల్లి రెవెన్యూ డివిజన్‌లో 3,986 కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసింది. వీరందరికీ ఈ నెల ఒకటో తేదీ నుంచి రేషన్ సరకులు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటి వరకు 6 నెలలకు ఒకసారి రేషన్ కార్డులు అందిస్తున్న ప్రభుత్వం తాజాగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తులను సచివాలయాల్లో నిరంతరాయంగా స్వీకరించాలని ఆదేశించారు. దరఖాస్తులు స్వీకరించిన అనంతరం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి, ఆరు నెలల్లోపు అర్హులను గుర్తించి వారికి రేషన్ కార్డులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంది. దీనిపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

అర్హత ఉంటే రేషన్ కార్డు



అర్హత ఉన్న కుటుంబాలకు రేషన్ కార్డులు మంజూరు చేసే ప్రక్రియ నిరంతరాయంగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయం నిరుపేదలకు మేలు చేస్తుంది. రేషన్ కార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుంది. గతంలో కంటే సులభంగా, పారదర్శకంగా కార్డుల జారీకి ప్రభుత్వ నిర్ణయం దోహదపడుతుంది. అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరవుతాయి.

– ఏజీ చిన్నికృష్ణ, ఆర్డీవో, అనకాపల్లి

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే సీఎం జగన్ ధ్యేయం



ప్రజల సమస్యలు వింటున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన మంత్రి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో మంత్రి అమర్‌నాథ్

కశింకోట: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలోని జి.భీమవరం గ్రామంలో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని కుటుంబాల వారీగా గణాంకాలతో సహా వివరించారు. సంక్షేమ పథకాలపై రూపొందించిన బ్రోచర్లను అందించి, అర్హులైనవారెవరైనా సంక్షేమ పథకాలు అందుకోని ఎడల, సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్థానికులతో మాట్లాడి పెండింగ్‌లో ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. రూ.25 లక్షలతో నిర్మించిన సచివాలయ నూతన భవనం, రూ.16 లక్షలతో నిర్మించిన పంచాయతీ కార్యాలయ భవనం, రూ.23 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ సెంటర్ భవనాలకు ప్రారంభోత్సవం చేశారు. ప్రాథమికోన్నత పాఠశాలలో రూ.18 లక్షల నాడు-నేడు నిధులతో చేపట్టిన పనులు, రూ.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీలు తదితర అభివృద్ధి పనులను ప్రారంభించారు. ప్రజలు అడుగడుగునా హారతులిచ్చి, పూల వర్షం కురిపించి ఘన స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామాల్లో రూ.వందల కోట్లతో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పనలో తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల అభివృద్ధే దేశ ప్రగతికి సోపానాలని నమ్మి, ఆ దిశగా కృషి చేస్తున్నారని కొనియాడారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రజల చెంతకే ప్రభుత్వ సేవల్ని చేరువ చేశారని పేర్కొన్నారు. గతంలో ఇవే సేవలు పొందాలంటే జిల్లా, మండల కార్యాలయాల చుట్టూ పనులు మానుకుని, కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదన్నారు. ఇపుడు ప్రతి సేవా సచివాలయంలోనే అందుతోందన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలకు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, రైతుల ప్రతి అవసరం తీర్చేలా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారని వివరించారు. వీటికి సొంత భవనాల నిర్మాణం శరవేగంగా జరుగుతోందన్నారు. వీటితోపాటు ఒక్కో సచివాలయాల పరిధిలో రూ.20 లక్షలతో స్థానికంగా సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించి, అభివృద్ధి చేస్తున్నామన్నారు. జల్ జీవన్ మిషన్‌లో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారుల్ని, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, అనకాపల్లి మార్కెట్ కమిటీ అధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, అనకా పల్లి మండలాధ్యక్షుడు గొర్లి సూరిబాబు, పార్టీ సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్య నాయుడు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కూండ్రపు అరుణ, సర్పంచ్ వెంకట్, ఎంపీటీసీ సభ్యుడు శంకరరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నీటిపల్లి లక్ష్మి, ఎంపీడీవో వీవీ రవికుమార్, తహసీల్దార్ జి.సత్యనారాయణ, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కరణం లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

పరవాడ: గర్భిణులు, బాలింతలు అధిక పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా మంచి ఆరోగ్యం పొందగలుగుతారని నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి అన్నారు. నాయుడుపాలెం శివారు వెంకటపతిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషకాహార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన పిల్లలను అందించే వీలు కలుగుతుందనే ఉద్దేశంతో ప్రభుత్వం పోషకాహార కిట్లు పంపిణీ చేస్తుందని చెప్పారు. ప్రొటీన్లు, విటమిన్లు, మినరల్స్, ఖనిజ లవణాలు, కొవ్వు పదార్థాలు శరీర ఎదుగుదలకు ఉపకరిస్తాయన్నారు. తక్కువ ఖర్చుతోనే బలవర్ధకమైన ఆహార పదార్థాలు తయారు చేసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా పోషకాహార పదార్థాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు కూండ్రపు శ్రీరామ్మూర్తి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమ, హెచ్ఎం రమణి, ఎం.ఎస్.కె త్రివేణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పి.కుమారి, కె.కృష్ణవేణి, సీహెచ్.వరహాలమ్మ, ఎం.పార్వతి, ఎస్.కమల, గోవిందమ్మ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.



వారోత్సవాల్లో మాట్లాడుతున్న సర్పంచ్ వరలక్ష్మి సీతారామయ్య

వలంటీర్ల సేవా నిరతి



కిమ్స్ ఆస్పత్రిలో హార్ట్ సర్జరీ జరిగిన లక్ష్మికి పింఛను అందిస్తున్న వలంటీర్ సాయిలక్ష్మి



సన్యాసిరావుకు పింఛన్ ఇస్తున్న వలంటీర్ భారతి

మునగపాక : పలువురు వలంటీర్లు తమ సేవా గుణాన్ని చాటుకుంటూ అందరి మన్ననలు అందుకుంటున్నారు. నాగులాపల్లి గ్రామానికి చెందిన పేలూరి సన్యాసిరావు అనారోగ్యంతో బాధపడుతూ ఏడాది కాలంగా అనకాపల్లి మండలం రేబాకలో ఉంటున్నారు. సెప్టెంబర్ నెలకు సంబంధించిన పింఛన్ సొమ్మును సంబంధిత వలంటీర్ డొక్కా భారతి ఆయనకు సోమవారం అందజేశారు. తోటాడకు చెందిన అంగులూరి పద్మ విశాఖ సెవెన్స్ హిల్స్‌లో గుండె ఆపరేషన్ చేయించుకోవడంతో సంబంధిత వలంటీర్ ద్రాక్షారపు శిరీష విశాఖ వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు. వలంటీర్లు అందిస్తున్న సేవలకు ఆయా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాంబిల్లి : మామిడివాడలో వలంటీర్ నందవరపు సాయిలక్ష్మి విశాఖ కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎం.లక్ష్మికి పింఛను అందించి సేవా నిరతి చాటుకున్నారు. హార్ట్ సర్జరీ చేయించుకొని లక్ష్మి కిమ్స్‌లో చికిత్స పొందుతుంది. దీంతో ఆమెకు విశాఖపట్నం వెళ్లి వలంటీర్ పింఛను అందజేయడంతో గ్రామస్తులు ఆమెను అభినందించారు.

డిమాండ్ల పరిష్కారానికి వినతి

సబ్బవరం: నిత్యావసర వస్తువుల ధరలను, పెరిగిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి. ప్రభావతి డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించి అనంతరం తహసీల్దార్సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ప్రభావతి మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, విద్యుత్ సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రూ. 400కే గ్యాస్ పంపిణీ చేయాలని, డీజిల్ ధరలను నియంత్రించాలని కోరారు. ఖాళీగా ఉన్న గ్రూప్1, గ్రూప్ 2 పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాల జీవోను వెంటనే అమలు తమ ప్రధాన డిమాండ్లు అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పాడ సత్యవతి, వై సోంబాబు, సుంకరి కృష్ణ, కంద అప్పారావు తదితరులు ఉన్నారు.

ఘనంగా కృష్ణుని రాట ఉత్సవం



నారాయుడుపాలెం మెట్టపై రాట వేస్తున్న భక్తులు

మునగపాక: మండలంలోని నారాయుడుపాలెం మెట్టపై సోమవారం కృష్ణునిరాట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

స్థిరంగా కూరగాయల ధరలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం కూరగాయల ధరలు దాదాపు స్థిరంగా ఉన్నాయి. టమాటా, ఉల్లిపాయ, బంగాళాదుంప కిలో రూ.30, దొండకాయ, బెండకాయ, గోరు చిక్కుడు రూ.40, బీరకాయ రూ.50, బీట్రూట్, క్యారెట్, వంకాయ, బరబాటి, చేమ దుంప రూ.60, పాదు చిక్కుడు, క్యాప్సికం రూ.100కు విక్రయాలు సాగాయి.

శరవేగంగా రైల్వే స్టేషన్ రోడ్డు విస్తరణ పనులు

అనకాపల్లిటౌన్: స్థానిక పెరుగుబజార్ జంక్షన్ నుంచి గాంధీబొమ్మ జంక్షన్ మీదుగా రైల్వే స్టేషన్‌కు వెళ్లే రహదారి విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అన్నారు. సోమవారం ఆయన రహదారి విస్తరణ పనులు, ప్లానింగ్ మ్యాప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ తొలగింపు ప్రక్రియ చివరి దశకు చేరుకుందని, త్వరలోనే డ్రైనేజీ, రహదారి విస్తరణ పనులు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. భావితరాల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని రహదారి విస్తరణ పనులు చేపట్టామని, దీనికి వ్యాపారస్తులు, గృహయజమానుల సహకారం అభినందనీయమన్నారు. ఆయన వెంట జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారి కె.జనార్దనరావు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, 84వ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ, పార్టీ నాయకులు కడిమిశెట్టి సతీష్, కారుకుండి కన్న, జక్కుల గిరిబాబు, దొండ సత్తిబాబు తదితరులున్నారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న జానకీరామరాజు

గడ్డికోత యంత్రాలతో పాడి రైతుకు మేలు

అనకాపల్లి రూరల్: పాడి రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా చేయూతనందిస్తోందని తుమ్మపాల సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు అన్నారు. సోమవారం గ్రామంలో నిర్వహించిన జగనన్న పాల వెల్లువలో మహిళా సభ్య రైతుకు రాయితీపై గడ్డికోత యంత్రాన్ని ఆయన అందించారు. 2 హెచ్‌పీ మోటారు సామర్థ్యం ఉన్న యంత్రం గరిష్ఠ ధర రూ.33,970 కాగా, రాయితీపై రూ.20382 లకే ప్రభుత్వం అందిస్తోందన్నారు. గడ్డికోత యంత్రాలతో పాడి రైతులకు శ్రమ తగ్గడంతోపాటు సమయం ఆదా అవుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్లలో రైతు సంక్షేమం కోసం సీఎం జగన్‌మోహన్ రెడ్డి వ్యవసాయరంగంలో ఎన్నో సంస్కరణలు అమలు చేశారని కొనియాడారు. జగనన్న పాల వెల్లువ ద్వారా పాడి రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పాడిరైతులు సద్వినియోగపర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.



గడ్డికోత యంత్రాన్ని రైతుకు అందిస్తున్న సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు

ఇరువర్గాల వివాదంపై డీఎస్పీ విచారణ

మునగపాక : మండలంలోని పల్లపు ఆనందపురంలో సోమవారం మధ్యాహ్నం పరవాడ డీఎస్పీ సత్యనారాయణ పర్యటించారు. ఇటీవల గ్రామంలో రెండు వర్గాల మధ్య జరిగిన వివాదానికి సంబంధించి కేసు నమోదైన నేపథ్యంలో ఆయన సచివాలయంలో విచారణ చేపట్టారు. కేసు విచారణకు రెండు వర్గాలు సహకరించాలన్నారు. వివాదాలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలన్నారు. ఆయన వెంట మునగపాక ఎస్ఐ మహమ్మద్ అలీ షరీఫ్ ఉన్నారు.

న్యాయం చేయాలంటూ స్థల బాధితుల వినతి

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని వెదురువాడ పరిధిలో తాము కొనుగోలు చేసిన స్థలాన్ని వేరొకరు వచ్చి తమదంటూ గొడవలు పెడుతున్నారని ఈ విషయంలో న్యాయం చేయాలంటూ పలువురు బాధితులు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. డీటీకి వినతి పత్రం అందజేశారు. ఈ విషయంలో క్షేత్ర స్థాయి దర్యాప్తు జరిపి స్థలం కొనుగోలు చేసిన వారికి న్యాయం చేయాలని కోరారు. దీనిపై డీటీ స్పందిస్తూ.. విచారణ జరిపి, నిర్ణయం తీసుకుంటామని ఫిర్యాదీలకు తెలిపారు.

ధరల నియంత్రణలో కేంద్రం విఫలం

- ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల వద్ద సీపీఎం నేతల ఆందోళన



ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసనలో సీపీఎం నాయకులు



కశింకోట తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

అనకాపల్లి రూరల్: విపరీతంగా పెరిగిన నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ఆరోపించారు. సీపీఎం సమరభేరి కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద ఆ పార్టీ నేతలు మెడలో కూరగాయల దండలు, నెత్తిన వంట గ్యాస్ సిలిండర్లు పెట్టుకుని వినూత్నంగా నిరసన తెలిపారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోవడంతో యువత నైరాశ్యంలో ఉండిపోతున్నారని, కొందరు నేరస్తులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో ప్రధాని మోదీ అధికారం చేపట్టిన నుంచీ రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ బలవంతంగా సంస్కరణల పేరుతో ప్రజల నెత్తిన మోయలేనంత ధరా భారాన్ని మోపుతున్నారని విమర్శించారు. అనంతరం ఆర్డీవోకు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో అనకాపల్లి మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, సీనియర్ నాయకులు ఎ.బాలకృష్ణ, ఆర్.శంకర్రావు, అల్లు రాజు, పి.శ్రీనివాసరావు, కె.ఈశ్వర్రావు, కె.వరలక్ష్మి, సుభాషిణి, బి.నూక అప్పారావు, భీశెట్టి అప్పారావు పాల్గొన్నారు.

కశింకోట: అధిక ధరలను నిరసిస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ తదితర ధరలను విపరీతంగా పెంచిందని, ఇది సామాన్యులకు భారంగా మారిందని మండిపడ్డారు. అనేక పోరాటల ఫలితంగా గ్యాస్ సిలెండర్ ధర తగ్గించారని, మిగిలిన వాటి ధరలు కూడా తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ జి.సత్యనారాయణకు వినతి పత్రం అందించారు. ఈ ధర్నాలో సీపీఎం నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా నాయకురాలు డి.డి.వరలక్ష్మి, ప్రతినిధులు ఆర్.శేషు, ఎస్.అప్పారావు, ఎ.అప్పలరాజు, లోవరాజు, జి.దేముడు, యు.సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఆహారాన్ని బట్టే ఆరోగ్యం



పౌష్టికాహార మాసోత్సవాల ర్యాలీ

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేట ప్రాథమిక పాఠశాల ఆవరణలో సోమవారం పోషకాహార మాసోత్సవాలను పురస్కరించుకొని అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ వాహిని ఫౌండేషన్ బ్లాక్ కో-ఆర్డినేటర్ హారిక మాట్లాడుతూ చిన్నారులకు తాజా కూరగాయాలతో ఆహారాన్ని అందించాలని సూచించారు. తీసుకొనే ఆహారమే ఆరోగ్యానికి కీలకం అని వ్యాఖ్యానించారు.

రాజీమార్గమే రాజమార్గం

యలమంచిలి : రాజీ మార్గమే రాజ మార్గమని యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి(మండల న్యాయ సేవాసంస్థ అధ్యక్షులు) ఎ. సాయికుమారి అన్నారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 9న జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా యలమంచిలి కోర్టులో జరిగే సదస్సులో కక్షిదారులు తమ కేసులను రాజీ చేసుకుని సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. క్రిమినల్ కేసులు, కుటుంబ తగాదాలు, ప్రిలిటిగేషన్ కేసులు, బ్యాంకు అప్పు, ఇంటి పన్ను బకాయిలు, టెలిఫోన్ బకాయిలు తదితర తగాదాలను పరిష్కరించుకోవాలని, కోర్టులో కట్టిన ఫీజులను తిరిగి వాపసు తీసుకునే అవకాశం కూడా ఈ లోక్ అదాలత్‌లో పొందవచ్చని తెలిపారు. కక్షిదారులందరూ రాజీమార్గాన్ని అనుసరించాలని, డబ్బులు, సమయం వృథా చేసుకోకుండా న్యాయం పొందాలని సూచించారు.